క్లుప్తంగా...

గవర్నర్‌ను కలిసిన ఆఫ్ఘన్ రాయబారి



రాంగోపాల్‌పేట్: భారత్‌లో ఆఫ్ఘాన్ రాయబారి ఫరీద్ మముండ్జ్యా మంగళవారం మర్యాదపూర్వకంగా గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను కలిశా రు. ఆయనతో పాటు నగరానికి వచ్చిన ఆఫ్ఘనిస్తా న్ ఇస్లామిక్ రిపబ్లిక్ ఎంబసీకి చెందిన అధికారుల బృందం, హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య గవర్నర్‌ను కలిసి కొద్దిసేపు ఆమెతో పలు అంశాలపై చర్చించారు.

పోరాటంతోనే సమస్యల పరిష్కారం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయదేవి అన్నారు. మంగళవారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సీపీఐ సికింద్రాబాద్ మూడోసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, స్థానిక సమస్యలపై పోరాడేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అడ్డగుట్టలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ఊసే మరిచారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార పార్టీ విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు స్టాలిన్, ఉమర్ ఖాన్, కొమరెల్లి బాబు, యాదగిరి, రంజిత్ సింగ్, సోమయ్య, లతీఫ్, మహ్మద్ యూసుఫ్, గౌరీ నాగరాజు, వెంకటయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. పదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ తొమ్మిదో తరగతి విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ముఖ్య అతిథిగా హాజరైన స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏ రంగంలో స్థిరపడినా నైతిక విలువలను వదలుకోకూడదన్నారు. సాధించాలనే కసి, పట్టుదల, సమయస్ఫూర్తి, కష్టపడే తత్వం ఉంటే విజయం వరిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ హెచ్‌ఎస్ త్రిపాఠి, సూర్యనారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సీతాఫల్‌మండిలో పర్యటిస్తున్న ఆదం సంతోష్‌కుమార్

సికింద్రాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆదం సంతోష్ కుమార్ అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం ఆయన సీతాఫల్‌మండి డివిజన్‌లోని చిలకలగూడ, కింది బస్తీ, అన్నా నగర్, నామాల గుండు బస్తీల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు విఫలం అవుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు సందీప్ రాజ్, రాజు సాగర్, అనిల్ కుమార్, జయరాజ్, కరీం, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలి

కంటోన్మెంట్: రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. బేగంపేట టీటీఐ ఆధ్వర్యంలో మంగళవారం కేంద్రీయ విద్యాలయ పికెట్‌లో విద్యార్థులకు ట్రాఫిక్‌పై నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్టాప్ లైన్, రూల్స్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితర నిబంధనలు, ఉల్లంఘించిన వారికి శిక్షలు, పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రూపేందర్ సింగ్, హేమ చందర్, పవన్ కుమార్, ట్రాఫిక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సాయన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న హర్యానా గవర్నర్ దత్తాత్రేయ, మంత్రి కొప్పుల ఈశ్వర్, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

పరామర్శల వెల్లువ

కంటోన్మెంట్: దివంగత కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కుటుంబ సభ్యులను మంగళవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల, పార్టీ నేత గట్టు రామచంద్రారావు తదితరులు సాయన్న కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కార్ఖానాలోని క్యాంపు కార్యాలయంలోనే ఆయన భార్య గీత, కుమార్తెలు ఉంటున్నారు. మంగళవారం ఉదయం వైస్సార్‌టీపీ నాయకురాలు షర్మిల సాయన్న కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. వారికి తాను అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు.

అనుబంధాన్ని గుర్తుచేసుకున్న దత్తాత్రేయ

సాయన్న భార్య గీతను పరామర్శించిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, సాయన్నతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో కంటోన్మెంట్ సమస్యలపై సాయన్న పదే పదే వినతి పత్రాలు అందజేసేవారన్నారు. సాయన్న మృతి కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటు, భగవంతుడు ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు.

దిగ్భ్రాంతికి లోనయ్యా: కొప్పుల

సాయన్న మరణం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కార్ఖానాలో సాయన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. సాయన్న మరణం తీరని లోటని, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబ సభ్యులు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

గ్రూప్-4 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నేడు స్క్రీనింగ్ టెస్ట్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్, వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్, లాస్యా ఇన్ఫోటెక్ సంయుక్తంగా గ్రూప్-4 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వైఎంసీఏలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయా సంఘాల అధ్యక్షులు పిట్ల నగేష్ ముదిరాజ్, జయకర్ డేనియల్, లాస్యా ఇన్ఫోటెక్ ఎండీ ఓరుగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో మంది పేద అభ్యర్థులు పోటీ పరీక్షల కోసం కోచింగ్‌కు వెళ్లి శిక్షణ తీసుకుని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని ఉన్నా పేదరికం కారణంగా దానికి దూరం అవుతున్నారన్నారు. అలాంటి వారికి ఉచితంగా శిక్షణ ఇచ్చి ప్రభుత్వం ఉద్యోగం సంపాదించేందుకు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ నెల 22 న ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ వైఎంసీఏలో ఉచిత శిక్షణకు హాజరయ్యే అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులందరికి 2 నెలల పాటు నిపుణులైన అధ్యాపకులచే శిక్షణ అందిస్తామని, ప్రతి వారం పరీక్ష నిర్వహిస్తూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా తర్ఫీదు ఇస్తామని వివరించారు. ఈ సందర్భంగా శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మొదటి బ్యాచ్ సికింద్రాబాద్ వైఎంసీఏలో మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని రెండో బ్యాచ్ కొంపల్లిలోని లాస్య ఫౌండేషన్‌లో ప్రారంభిస్తామని చెప్పారు. వివరాలకు 9849577637, 9346151990 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

తడి..పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



చంద్రబాబునగర్‌లో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: ఇంట్లోని చెత్తను తడి పొడిగా వేరు చేసి చెత్త సేకరించే కార్మికులకు అందించడం ప్రజలందరి బాధ్యత అని నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేట చంద్రబాబునగర్‌లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాంకీ సంస్థ సిబ్బంది, జీహెచ్‌ఎంసీ కార్మికులతో ఇంటింటికి తిరిగి చెత్త నిర్వాహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. దీంతో పాటుగా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాంకీ సంస్థ సర్కిల్ ఇంచార్జ్ దశరథ్, సానిటరీ సూపర్‌వైజర్ స్వర్ణ పద్మావతి, మానస గౌడ్, ఎస్ఎఫ్ఏ యాకయ్య, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలి

ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి ఆదివారం పది నిమిషాలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించేలా ప్రజలను చైతన్యం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే దోమల నివారణకు డ్రోన్‌ల ద్వారా రసాయనాలను పిచికారి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు రాంబాబు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, యూషూఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాఖల వారీగా పీహెచ్‌డీ ఫలితాలు వెల్లడించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఫలితాలను శాఖల వారీగా వెల్లడించాలని ఓయూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డిని కలిసి పీహెచ్‌డీ ఫలితాలపై ఆరా తీసిన వారు అనుమానం వ్యక్తం చేశారు. వివిధ శాఖలు, సబ్జెక్టులు, కులాల వారీగా ఫలితాలను వెల్లడించాలని కోరారు. అనంతరం వివిధ శాఖలు, సబ్జెక్టులు, కులాల వారీ జాబితాను రిజిస్ట్రార్‌కు అందజేసినట్లు డైరెక్టర్ తెలిపారు.

కోత..కుట్టు లేకుండా గుండె చికిత్స

మెడికవర్ ఆస్పత్రి వైద్యుల ఘనత

అమీర్‌పేట: ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సిన గుండెకు కోత కుట్టు లేకుండానే చికిత్స చేసి ఓ వృద్ధుడి ప్రాణాలను కాపాడారు అమీర్‌పేటలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు దీపక్, సాకేత్, అవినాష్ దశ్ వివరాలు వెల్లడించారు. మలక్‌పేటకు చెందిన సైయ్యద్ ముజాయిద్దీన్ గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చాడని తెలిపారు. అతడికి వైద్య పరీక్షలు చేసి గుండెకు రంధ్రం, హార్ట్ ఫెయిల్యూర్ అయినట్లు గుర్తించామన్నారు. ఇలాంటి కేసుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ చేసి రంధ్రం పూడ్చటం జరుగుతుందని, అయితే ముజాయిద్దీన్ వయస్సు రిత్యా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం హై రిస్క్‌తో కూడుకున్నదని భావించి వీఎస్‌డి డివైస్ క్లోజర్ విధానం ద్వారా గుండె కోత లేకుండా తొడ భాగం నుంచి వీఎస్‌డిని గుండెలోనికి ప్రవేశపెట్టి రంధ్రాన్ని పూడ్చివేసినట్లు వివరించారు. ఆధునిక వైద్య పరికరాలు, అనుభజ్ఞులైన వైద్యుల వల్లే ఇది సాధ్యపడిందని తెలిపారు సమావేశంలో వైద్యులు అంగనా, హృషికేశ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల జీవితాల్లో వెలుగు



సీఎంఆర్‌ఎఫ్ పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీఎంఆర్‌ఎఫ్ ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని లలితా నగర్ ప్రాంతానికి చెందిన నాగేశ్వర్‌రావు అనారోగ్య సమస్యలతో అత్యవసరంగా ఆస్పత్రిలో చేరాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి నాగేశ్వర్‌రావుకు చికిత్స నిమిత్తం రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఇందుకు సంబందించిన పత్రాలను మంగళవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

భారత్ జోడో యాత్రను మర్చిపోను

ఉస్మానియా యూనివర్సిటీ: జీవించినంతకాలం భారత్ జోడో యాత్రను మర్చిపోనని ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ తమిళనాడు ఇన్‌ఛార్జి, ఓయూ పూర్వవిద్యార్థి డాక్టర్ కేతూరి వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట 2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఓయూ జేఏసీ నాయకులు వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేసిన తనకు రాహుల్‌గాంధీతో కలిసి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్రలో పాల్గొనే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఐదు నెలలు, 14 రాష్ట్రాలు, 4084 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రలో పాల్గొని ప్రజల స్థితిగతులు తెలుసుకున్నానని దేశ ఐక్యత, అభివృద్ధికి జీవితాంతం సేవలందిస్తానని వెంకటేష్ పేర్కొన్నారు.



వెంకటేష్‌ను సన్మానిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

మాస్టర్స్ అథ్లెట్స్‌కు ప్రభుత్వ సహకారం అందించాలి

కంటోన్మెంట్: హర్యానా కురుక్షేత్రలో ఈ నెల 16 నుంచి 19 వరకు జరిగిన మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు 85 మెడల్స్, ఓవరాల్ ఛాంపియన్షిప్ లో ద్వితీయ స్థానం సాధించారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ అథ్లెట్స్‌ను ఘనంగా సన్మానించారు. ట్రయథ్లాన్ చాంపియన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, రాగీరు ప్రభుకుమార్ గౌడ్ తదితరులను బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ మాస్టర్ అథ్లెట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. జాతీయ పోటీల్లో మొత్తం 18 రాష్ట్రాల అథ్లెట్స్ పాల్గొనగా, తెలంగాణ నుంచి 163 మంది పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ క్రీడాకారులు 25 బంగారు, 24 కాంస్య పతకాలు సాధించారన్నారు. కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెట్స్ అంజిరెడ్డి,మల్లారెడ్డి, రామస్వామి యాదవ్, లక్ష్మి, సత్యనారాయణ, స్థానికులు షకీబ్, పెరుక మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మర్రి లక్ష్మణ్ రెడ్డి



దివంగత ఎమ్మెల్యే సాయన్నకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సాయన్న మరణం తీరని లోటు

రసూల్‌పురా: ఎమ్మెల్యే జి. సాయన్న అకాల మరణం కంటోన్మెంట్ ప్రజలకు తీరని లోటని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బోర్డు రెండో వార్డు రసూల్‌పురాలో దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాదరణ పొందారన్నారు. ఆయన ఆశయాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కొనసాగించాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, అంజనేయులు శ్యామ్ రెడ్డి, నర్సింహ్మా, నాగరాజు, నరేష్, మహేందర్, మహేష్, పొన్నాల బాబు, సురేష్, భాస్కర్, మధు, శ్యామ్., ఉస్మాన్, వాహాబ్, మహిళలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాల పంపిణీ

సనత్‌నగర్: పదో తరగతి పరీక్షలు త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలలో చదువుతున్న 70 మంది పేద విద్యార్థులకు కేరింగ్ హ్యాండ్స్ టు గెదర్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆల్ ఇన్ పుస్తకాలను పంపిణీ చేశారు. పేద విద్యార్థులు సులువుగా చదువుకునేందుకు వీలుగా సంస్థ ప్రతినిధులు ప్రతినిధులు అట్లూరి అజిత్‌కుమార్, రాజ్‌కుమార్‌ల సహకారంతో బీజేపీ నేతలు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర యువమోర్చా నాయకులు మర్రి పురూరవరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్, సీనియర్ నాయకులు దయానంద్, నరేష్, ఆకూరి శ్రీనివాసరావు, చంద్రకుమార్, కర్రె భాస్కర్, మురళీ, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రవికాంత్‌గౌడ్, కిరీటా తదితరులు పాల్గొన్నారు.



ఆల్ ఇన్ వన్ పుస్తకాలను పంపిణీ చేసిన మర్రి పురూరవరెడ్డి, బీజేపీ నాయకులు

అభినందనల వెల్లువ

- టెన్నిస్‌లో గోల్డ్ మెడలిస్ట్ భవానీ కేడియాకు సత్కారం



రాంగోపాల్‌పేట్: 25వ జాతీయ డెఫ్ సీనియర్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన తెలంగాణాకు చెందిన భవానీ కేడియాకు అభినందనలు వెల్లువెత్తాయి. మంగళవారం మినిష్టర్‌రోడ్‌లోని ఇలాచీ కేఫ్ రెస్టారెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, మాజీ ప్రభుత్వ కార్యదర్శి అజయ్ మిశ్రా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్, అధికార ప్రతినిధి మహ్మద్ కాలిఖర్ రెహ్మాన్‌లతో పాటు పలువురు అతిథులు ఆమెను అభినందనలతో ముంచెత్తారు. ఇండోర్‌లో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన పోటీల్లో కేడియా బంగారు పతకం సాధించింది. వినికిడి లోపం ఉన్నా జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో బంగారు పతకం సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేటగిరీలో బంగారు పతకం సాధించిన మొట్టమొదటి యువతి భవాని కేడియా అని వారు పేర్కొన్నారు. భవానీ కేడియాను ప్రోత్సహించిన ఆమె తల్లిదండ్రులు నీరజ్ కేడియా, మధుకేడియా కోచ్ గోపీరాజ్ కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. ఇలాంటి క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి మరింత ప్రోత్సాహం లభించేలా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుని వెళతామన్నారు. ప్రస్తుతం సెయింట్ ఆన్స్ కాలేజీలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతూనే టెన్నిస్‌లో రాణిస్తుందని, రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

హాస్పిటల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

లాలాపేట: హాస్పిటల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అఖిల పక్ష నేతల బృందం బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆలకుంట హరి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 30 వేల జనాభా మాణికేశ్వరి నగర్‌లో వైద్య సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మాణికేశ్వర్‌నగర్ కమాన్ పక్కన ఉన్న సర్వే నెంబర్ 169 స్థలాన్ని గతంలో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటుకు కేటాయించిందన్నారు. అయితే ప్రస్తుత ఓయూ అధికారులు సదరు స్థలం తమదంటూ వివాదాన్ని లేవనెత్తారని పేర్కొన్నారు. సదరు స్థల వివాదాన్ని పరిష్కరించి అక్కడ గవర్నమెంట్ హాస్పిటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గతంలో పలు మార్లు వినతి పత్రం ఇచ్చామని బస్తీ నాయకులు మంత్రికి గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు గండికోట విజయ్‌కుమార్, ఏ శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, గండికోట నర్సింహ, మల్లేశం, రవితేజ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వడ్డెర బస్తీ నేతలు

ఓయూను సందర్శించిన యూకే ప్రొఫెసర్లు



ఉస్మానియా యూనివర్సిటీ: యూకేకు చెందిన ప్రొఫెసర్ల బృందం ఓయూను సందర్శించింది. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్య మండలి నిర్వహిస్తున్న సదస్సుకు హాజరైన యూకే వర్సిటీ ప్రొఫెసర్లు ఓయూ క్యాంపస్‌ను సందర్శించి వివిధ ప్రాంతాలతో పాటు ఆర్ట్స్ కాలేజీని చూశారు. అనంతరం పాలనా భవనంలో వీసీ ప్రొ.రవీందర్ ఇతర అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై చర్చించి బోధన, పరిశోధనల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు.

'మీ సహకారం ఎనలేనిది'

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆఫ్ఘనిస్థాన్ విద్యార్థులు ఉన్నత విద్యను ఆర్జించడం గర్వంగా ఉందని రాయబారి ఫరీద్ మహ్మద్ జాయ్ అన్నారు. మంగళవారం ఓయూ ఆఫీస్ ఆఫ్ ద ఇంటర్నేషనల్ అఫైర్స్ హాల్ జరిగిన కార్యక్రమంలో ఆఫ్ఘన్ ప్రతినిధి బృందం ఓయూ వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ప్రొ.అప్పారావుతో సమావేశమై పలు అంశాల పై చర్చించారు. భారతీయ విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాలు ఉన్నతవిద్యలో ఆఫ్ఘన్‌కు అందిస్తున్న సహకారంపై కృతజ్ఞతలు తెలిపారు.



ఆఫ్ఘన్ బృందంతో ఓయూ అధికారులు

రహదారి అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: ఎర్రగడ్డ-సనత్‌నగర్ ప్రధాన రహదారి అభివృద్ధితో వాహనదారులు, ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ మెయిన్‌రోడ్డులో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రోడ్డు విస్తరణతో పాటు డివైడర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు ఎంతో ఇరుగ్గా ఉండేదని, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సబ్‌స్టేషన్ స్థలాన్ని సేకరించడంతో రోడ్డు విశాలంగా మారిందన్నారు. రోడ్డు విస్తరణలో అడ్డంకిగా ఉన్న అక్రమ నిర్మాణాలు, విద్యుత్ స్తంభాలను తొలగించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు, డివైడర్ల నిర్మాణం పూర్తయితే ఈ రహదారిలో ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయన్నారు. అనంతరం దాసారం బస్తీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని కొందరు కోరగా, మరికొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు అందించేందుకు పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బస్తీ దవాఖానాలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. 64 రకాల వైద్య పరీక్షలు బస్తీ దవాఖానాలో చేసేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. బస్తీవాసుల ఏకాభిప్రాయం తర్వాతనే బస్తీ దవాఖానా ఏర్పాటుపై నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం తాను నిరంతరం పనిచేస్తున్నాన్నారు. తాను వచ్చిన తర్వాత ఎన్ని అభివృద్ధి పనులు జరిగాయో, ఎన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయో అందరికీ తెలిసిందేనన్నారు. ఈ నెల 26న బస్తీవాసులతో సమావేశం నిర్వహిస్తామని, బస్తీవాసులు ఏకాభిప్రాయానికి రావాలన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, నాయకులు బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఖలీల్‌బేగ్ తదితరులు ఉన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

క్రైం కార్నర్..

చైన్‌స్నాచింగ్‌కు యత్నించిన యువకుడి అరెస్ట్

చిలకలగూడ : ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లేందుకు యత్నించిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన ఇనాయత్ అలీ టాటా ఏస్ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను సులభంగా డబ్బులు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈనెల 11న బైక్‌పై తిరుగుతూ చిలకలగూడ ఠాణా పరిధిలోని అభినవ్‌నగర్ కాలనీకి వచ్చాడు. అదే ప్రాంతానికి చెందిన మహిళ షాలినీ ఒంటరిగా నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు యత్నించాడు. అప్రమత్తమైన ఆమె గొలుసుతోపాటు నిందితున్ని పట్టుకుని గట్టిగా కేకలు వేయడంతో ఆమె నుంచి విడిపించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల ఫూటేజీ ఆధారంగా నిందితుడు మహ్మద్ ఇనాయత్‌అలీగా గుర్తించారు. చిలకలగూడ క్రాస్ రోడ్‌లో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా వాహనంపై అటుగా వచ్చిన నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నేరం అంగీకరించాడు. బైక్ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు మహ్మద్ ఇనాయత్ అలీ

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



రసూల్‌పురా: తిరుమలగిరి పీఎస్ పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం స్వాధీనం చేసుకున్న పోలీసులు గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై గులబీ రంగు టీషర్టు వైట్ పాయింట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సంబంధీకులు తిరుమలగిరి పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.